జీవిత సారం

నేను రెండుతడవలు రాజారాంగార్ని కలుసుకోవల్సిన అవసరం ఏర్పడ్డది. ఆయన నాకు కొత్తగా పరిచయం అయినవాడు. ఆయన స్వభావమెలాంటిదో, తత్వమెలాంటిదో రెండు తడవలు కలుసుకున్నంత మాత్రాన తెలీదుగా! అయితే ఒకటి: నేను ఆయన్ని చూసి చాలా ఆశ్చర్యపడ్డమాట మాత్రం నిజం. '' ఆ సంఘటనయేమిటో చెప్పకపోతే నాకు తోచకుండా వుందిరా, శేషగిరీ!'' అన్నాడు శ్రీనివాసరావు. అతని కళ్ళల్లో ఆశ్చర్యం స్పష్టంగా కనిపించింది.

శేషగిరి పార్కు కాంపౌండుగోడకి అంటించివున్న వాల్‌పోస్టర్‌లవేపు చూస్తూ, '' ఎందుకో అంత ఆశ్చర్యం! ఆయనేం మనిషికాదా, ఆయనతత్వాలలో ఏమన్నా దేవత్వాలు కన్పించినాయా!'' అని ప్రశ్నించాడు వేరుశనగకాయ వొలిచి నోట్లో వేసుకుంటూ.

శ్రీనివాసరావు దట్టంగా పచ్చగా పెరిగివున్న గడ్డిమీద ఏటవాలుగా పడుకుని బహుశా పరధ్యాన్నంగా వున్నాడేమో, పచ్చగడ్డిలోకీ, అటూ ఇటూ నవనాగరిక యువతులకుమల్లె విహరిస్తూన్న సీతాకోకచిలకల్ని చూస్తూ, ''రాజారాంగార్ని అర్థంచేసుకోలేకపోయానురా. ఎలా అర్థం చేసికోగలను? నువ్వే చెప్పు'' అన్నాడు.

'' ఏమిటో చెప్పరాదూ!'' అని ప్రశ్నించాడు శేషగిరి శ్రీనివాసరావును, వేరుశనగకాయలు ముగించి, సిగరెట్ వెలిగిస్తూ.

చల్లని సాయంకాలపు పిల్లవాయువుల్ని అనుభవిస్తూ శ్రీనివాసరావు చెప్పసాగాడు:

★ ★ ★

అదే రాజారాంగార్ని కలుసుకోటం మొదలు; ఆయన్ని వాళ్ళింట్లోనే కలుసుకున్నాను. ఆయన ఆట్టేవున్న వాడు కాదు. మధ్యరకం. ఊళ్లో మంచి పలుకుబడిగల పెద్దమనిషి. ఆయన తోటి నాకు అవసరం కలిగింది; వూళ్ళో వున్న ఫ్యాక్టరీ కూలీ వొకడికి కుడిచేతి బొటనవేలు తెగిపోయింది. అతని ''కంపెన్సేషన్'' ఎంత ఇవ్వాలి అన్నవిషయమై సమస్య ఏర్పడింది. ఇది లేబర్ ఆఫీసర్లకు తెలిసి, రభస అయిపోవడంకంటే, మధ్య వర్తి పరిష్కారానికి వెళ్ళడం ఇటు యజమానికి అటు కూలీకీ మంచిదనిపించి, రాజారాంగార్ని మధ్యవర్తిగా ఎన్నుకున్నారు. రాజారాంగారు మంచివాడు. బీదసాదా అంటే కనికరం వున్న మనిషిగనక ఆ కూలీకిగూడా ఆయన తీర్పులో నమ్మకం ఏర్పడింది కాబోలు. '' ఆయన ఏం చెబితే అది వింటా'' నన్నాడతను.

ఇటు ఫ్యాక్టరీయజమాని నాకు ముఖ్యుడు. ఆయన తరుపున నేను వెళ్ళాల్సి వచ్చింది రాజారాంగారి దగ్గిరికి. నా స్నేహితుడు ఫ్యాక్టరీ మూసేసేస్థితిలో వున్నాడు. ధాన్యం ధరలు పడిపోవటంతో విపరీతమైన నష్టాలు సంభవించి, బాకీలు పడి ఐ. పి. పెట్టేస్థితికి వొచ్చివున్నాడాయన. ఆయన 'కంపెన్సేషన్' ఏదో కొద్దిగా ఇచ్చి ఎలాగో సర్దుకోవాలి ఈ బాధనించి, అనుకుంటున్నాడు. అతని ఇష్టాన్ననుసరించి మాట్లాడాలి నేను.

నేను రాజారాంగారింటికి ఒక ఉదయం పదిగంటల కెళ్ళాను. ఆయన ఇంటివసారాలో వాలుకుర్చీలో పడుకుని పత్రిక చదువుకుంటున్నాడు. మనిషి ఆజానుబాహువు. చామనచాయగా వున్నాడు. 'ఖచ్చితమైన మనిషి' సుమా అనిపించే మీసాలూ, దట్టమైన కనుబొమలూ, విశాలము, తీక్షణమైన కళ్ళూ.

రాజారాంగారు నన్ను కూర్చోబెట్టి ''మీరేనా, రామనాధంగారి తరపున మాట్లాడ్డానికి వొచ్చింది? నేనొకటి రెండు మాటలు చెబుతాను. వాటి కిష్టపడితే తర్వాత మనం మాట్లాడుకోవచ్చు. లేదా ఈ విషయం విరమించడమే'' అన్నాడు.

నేను ఆయన కభిముఖంగా కూర్చుని ''చెప్పండి'' అన్నాను.

''నేనిలాంటి మధ్యవర్తిత్వాని కొప్పుకునేవాణ్ణి కాదండీ అసలు; అవతల బాధపడే కూలీ. అతను నాకు కొంచెం పరిచయస్తుడు. అందుకని... నేను చెప్పేతీర్పును ఉభయులూ అంగీకరించితీరాలి. అట్లా ఐతేనే నే నిందులో జోక్యం చేసుకుంటాను. ఆ వేలు పోగొట్టుకున్న అతను నా తీర్పు వొప్పుకుంటాడు. మీరూ అంగీకరిస్తారా! ముందే చెప్పండి'' అన్నాడాయన ఖచ్చితంగా.

ఆయన స్వరంలోని నిర్మొగమాటం, ఖచ్చితం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. అయినా తీరా వొచ్చి వొప్పుకున్న తర్వాత ఎలా కాదనటం? రెండు నిమిషాలు ఆలోచించుకుని, ''మీరన్నమాట కాదంటామా? అయినా మీరు మా ఫ్యాక్టరీయజమాని స్థితిని కూడా కొంచెం ఆలోచించి...'' అనిన్నాను.

''నేను అన్నీ విన్నాను. మీ సంగతీ ఆలోచించాను. మీరు ముఖ్యంగా అవతలవాడికిజరిగిన అన్యాయాన్ని గుర్తించాలి. కుడిచేతి బొటనవేలు అంటే సామాన్యమా! ఒక మనిషి జీవితమే అది. ఆ వేలు లేకపోయినతర్వాత అతను వృత్తిపనులు చేసుకోటానికి ఎలాగా వీలులేదు. మీరతన్ని జీవితాంతం పోషించలేరుగదా? కనుక...'' అని రాజారాంగారు ఆగిపోయి, లోగడ ఎక్కడెక్కడో ఇటువంటికేసుల్లో కాంపెన్సేషన్‌లు ఇచ్చిన వివరాల కాయితాలు చూసి, మెల్లగా, ''ఐదొందలివ్వండి ఎలాగో సరిపెట్టేస్తాను. వెయ్యీ, పదిహేను వందలిచ్చిన ఉదాహరణలు చాలా వున్నాయి. అయినా మీ స్థితినిబట్టి అలా అడగలేకపోతున్నాను. మీకుకనక నా మాట నచ్చితే ఐదొందలు ఇచ్చివెళ్ళండి. లేదా, మీరు ఆ కూలీ ముఖాముఖీని మాట్లాడుకోవాల్సివుంటుంది'' అనేశాడు. ఇక ఆ మాటకు తిరుగులేదన్నట్టుంది ఆధ్వని.

నేను లేచాను. సంగమేశ్వర్రావును - అదే, ఆ ఫ్యాక్టరీ యజమానిపేరు - కనుక్కోందేనేనే మాటా చెప్పలేకండా వున్నాను... రెండొందల వరకయితే నాక్వర్రత వుంది... ''నేను వెళ్ళి సంగమేశ్వర్రావుగారితో సంప్రదించి సాయంత్రంవొచ్చి ఏమాట చెబుతానండి!'' అన్నాను.

★ ★ ★

నేను సంగమేశ్వర్రావూ చాలా సేపు ఆలోచించాము. ఎంత ఆలోచించినా ఆ సమయానికి ఐదొందలు పుట్టించటం కష్టమైంది; నేను తిరిగివెళ్ళి రాజారాంగార్ని కలుసుకొని బతిమాలుకున్నాను - ఓ వందయినా తగ్గించమని.

రాజారాంగారు నిష్కర్షగా చెప్పేశాడు. 'దమ్మిడీ తగ్గదని, లేదా లేబర్ డిపార్టుమెంటే తేలుస్తుందిలే' అనేశాడు. ఆయన మాటకు తిరుగులేదు. ఏంచెయ్యడం? చివరికి ఏభై అయినా తగ్గించమని బతిమాలాను. వీలుకాదన్నాడు.

ఓ వారం గడువు పెట్టాం. ఈలోగా ఎలాగో డబ్బు పుట్టించి తీసుకెళ్ళి ఇచ్చేద్దామనుకున్నాం. అలాగే ఓ వారం ఐనాక ఓ ఉదయంపూట సంగమేశ్వర్రావూ నేనూ డబ్బు పట్టుకుని రాజారాంగారింటికి బయల్దేరాం.

రాజారాంగారింటిదగ్గరగా వెళ్ళాక ఆ యింట్లోంచి ఏదో విషాదస్వరం వినిపిస్తే కాస్త శంకిస్తూనే లోపలికెళ్ళాం. రాజారాంగారు తలొంచుకుని వసారాలో పచారు చేస్తున్నాడు. లోపల ఆయన భార్య కాబోలు, ఏడుస్తూంది

ఏమిటో విషయం? నాలో ఆదుర్దా ఎక్కువయింది.

మేము లోపలికెళ్ళగానే రాజారాంగారు తిరిగి గంభీరమైనగొంతుకతో, ''అలా కూర్చోండి'' అని ఆహ్వానించారు. ఎంత గంభీరంగా అగుపించాలని ప్రయత్నిస్తున్నప్పటికీ మనిషిఎందుకో తీవ్రంగా బాధపడుతున్న ఛాయలు మొహాన కన్పిస్తూనే వున్నాయి.

''ఐదొందలు ...'' అనబోతున్నాను నేను.

రాజారాంగారు తలవంచుకుని తిరుగుతున్నవాడల్లా ఓ వసారా స్థంభాన్నానుకుని నిలబడి, ''మీరు రేపో ఎల్లుండో రాకూడదటండి! నా మనసేమీ బాగులేదిప్పుడు'' అన్నారు కొంచెం విరక్తిగానూ బాధగానూ.

''ఏం జరిగింది?'' అని అడిగాడు సంగమేశ్వర్రావు. ఉదయపు ఎండకాంతి ఏదో తీవ్రమైన బాధతోను, నిద్రలేమి తోటి ఎర్రబారిన రాజారాంగారి కళ్ళమీదపడి మెరుస్తోంది. ఆయన నిశ్చలమైన యోగిలా నిలబడి, పెదిమకొరుక్కుంటూ, ''నా చంటికూతురు నాలుగేళ్ళది. నిన్నసాయంత్రం లారీకింద పడి చనిపోయింది... నా మనసు మనసులోలేదు. క్షమించండి'' అన్నాడు తడబడుతూ మా గుండెలు ఝల్లుమన్నయ్. వారం క్రితం నేను ఇక్కడికొచ్చినప్పుడు ఆ పసిది ఓ పరికిణీ అడ్డదిడ్డంగా కట్టుకుని వసారాలో బంతిలాగా గెంతుతోంది. ఎంతో ముద్దుగా ముచ్చటగా వుంది!.

''అయ్యో! ఎంతపని జరిగిందండి! ఎవడా లారీవాడు? వాణ్ణి ఏంజేశారు? వొదిలేశారా?'' అన్నాడు కచ్చగా.

రాజారాంగారు, ఇదివరకటిదాకా పైకప్పువంక చూస్తున్నవాడల్లా, ''పాపం, లారీవాణ్ణి అని

ప్రయోజనం లేదు; మా పిల్లదే అకస్మాత్తుగా రోడ్డుకి అడ్డంగా పరిగెత్తింది; అక్కడికీ లారీడ్రైవరు బ్రేక్ వేశాడు. ఏం ఉపయోగం! లారీ వెనక చక్రాలకింద పడి నలిగిపోయింది అమ్మాయి... పంచాయితీ తీర్పులో కూడా ఇదే రుజువైంది. ఒకళ్ళదాకా ఎందుకు? నేను ఈ అరుగుమీదకూర్చుని చూస్తూనేవున్నాను గదా! అబద్ధం ఎలా చెప్పగలం! లారీ వాళ్ళ తప్పులేదు. హారన్ వాయించాడు; మెల్లిగానే వొస్తోందిగూడానూ ఆ లారీ...'' అని ఆగిపోయాడు ఆయన. తను చూస్తూండగా తనచిన్ని కూతురు భూతంలాంటి లారీకింద పడి గుమ్మడికాయ చితికినట్టు చితికిపోయి రక్తపు మడుగులో పొర్లాడి బాధపడి చనిపోవటం ఆయన మనోనేత్రంముందు మళ్ళీ ఒకసారి గోచరమైంది గాబోలు. అంత స్థైర్యంగల వ్యక్తీ గొల్లుమని ఏడ్చేశాడు; ఆశోకాన్ని వారించడం మాతరం కాదు, కాలేదు.

ఆయనంతట ఆయనే ఐదునిమిషాలకు తమాయించుకున్నాడు.

మేమిద్దరం లేస్తూ, ''కాస్త ఓర్పు వహించాలి మీరు. మీరే బెంబేలుపడిపోతే ఇంట్లోవాళ్ళు మరీ బేలపడిపోతారు. ఊరుకోండి'' ఓదార్పుగా అని 'వెళతా' మనబోతున్నాను.

ఇంతలోనే ఓ చిన్నకారు ఇంటిముందుకొచ్చి ఆగింది. దాన్లోంచి ఇద్దరు, ఖరీదైన సిల్కుదుస్తులు ధరించినవ్యక్తులు దిగి లోపలికి వచ్చారు.

''మళ్ళీ యెందుకొచ్చారిక్కడికి?'' అన్నాడు రాజారాంగారు కాస్త తీవ్రంగా.

వాళ్ళల్లో పొడుగాటి ఆయన లారీ యజమాని అనీ, రెండో ఆయన వకీలు అనీ మాకు తెలిసింది.

వకీలు మెల్లిగా సంభాషణ ప్రారంభించాడు. ''నాక్లయింటు మీకు జరిగిన ఈ ప్రమాదానికి చాలా విచారిస్తున్నారండి'' అంటూ.

రాజారాంగారు అడ్డువచ్చి, ''నిన్ననే తేలిపోయింది గదండీ వ్యవహారం! మళ్ళీ ఆ సంఘటనను జ్ఞాపకం చెయ్యకండి. దయచేసి వెళ్ళండి. మీ తప్పేంవుంది ఇందులో? లారీ డ్రైవరు ట్రాఫిక్ రూల్ ప్రకారం నిర్దోషి అని రుజువైంది గదూ? ఇంక నాతోటి మీకేం పని?'' అని అడిగాడు:

వకీలుకు బదులు లారీయజమాని రాజారాంగారిదగ్గరికి వెళ్ళి ఆయనరెండుచేతులూ పట్టుకుని ''మీరు మీ కూతుర్ని పోగొట్టుకునిగూడా ఎంతో శోకంతో వుండిగూడా పంచాయతీ వాళ్ళకు నిజం చెప్పారు. అభాగ్యుడైన ఆ డ్రైవర్ని శిక్షనించి తప్పించారు... కాని... కాని, నా మనస్సు ఊరికే బాధపడిపోతున్నదండి... ఈ మహాపాపానికేదైనా పరిహారం చెయ్యాలని... మీరు ఏమీ అనుకోకుండా...'' 'అంటూవుంటే రాజారావుగారు కన్నీళ్ళు తొణికిసలాడుతున్న కళ్ళు మెల్లిగా పైపంచతో తుడుచుకుంటూ, ''పరిహారమా! ఇందులో 'పరిహారం' అనే ప్రసక్తే లేదు!'' అన్నారు మెల్లిగా.

ఇంతలో వకీలు జేబునుంచి తళతళలాడుతున్న కొత్తనోట్లకట్టలు బైటికి తీసి, ''మాక్లయింటుకి పంచాయితీ తీర్పుతో పరిహారం ఇవ్వాల్సిన అవసరం చట్టరీత్యా కలుగని మాట నిజమే; కాని, అంతరాత్మ

అనేది ఒకటి వుందిగదాండి? మీకు ఏదో తృణమో పణమో ఇచ్చి మా మనస్సుకి కొంత సంతోషం కలుగచెయ్యాలని మాకు తోచింది. అలా కాకపోతే మాకు మనశ్శాంతి వుండదు. ఈ ఐదువేలూ తీసుకోండి. ఇది మీరు పోగొట్టుకున్న విలువకి ఎలాగూ సమానంకాదనుకోండి'' అన్నాడు, ఆ నోట్లు రాజారాంగారికియ్యబోతూ.

ఆ వచ్చిన యిద్దరూగూడా చాలా జాలిగొల్పుతున్నారు మాకు. నాకాక్షణాన ఒక ఆలోచన కలిగింది. బొటన వ్రేలికి ఐదొందలు విలువగట్టి ఇవ్వాలి - అని పట్టుబట్టిన వ్యక్తి ఒక ప్రాణానికి ఎంత డిమాండ్ చేస్తాడో! చట్టరీత్యా ఐతే వాళ్ళ దుంప తెంచేసివుండేవారు; ఈ నిమిషాన ఆయన 'నాకు ఐదువేలు చాలవు, పదివేలు కావాలన్నా వీళ్లు ఇచ్చేట్టున్నారు,' అనిపించింది నాకు. అందులోనూ రాజారాంగారు మహానిక్కచ్చిమనిషాయెను!

కాని రాజారాంగారు ఆ యిద్దర్నీ ఉరిమి చూశారు కళ్లు పెద్దవిచేసి. ''వెళ్ళండి, వెళ్ళండి... ఉఁ.పొండి... నా కూతురు ప్రాణాన్ని వెధవడబ్బుతో విలువకట్టజూస్తున్నారా! నా కూతురు ఐదువేలుచేస్తుందా! లక్ష యిస్తేమాత్రం నా కూతురు వస్తుందా? వెళ్ళిపోండి'' అని వాళ్ళను విదిలించాడు.

ఆ తర్వాత వాళ్ళు యింకా ఐదువేలు యిస్తామన్నారు ''చాలదు'' అంటున్నాడేమో ననుకుని. కాని రాజారాంగారు, ససేమిరా దమ్మిడీ పుచ్చుకోనన్నారు. అలా డబ్బు పుచ్చుకోటం, తనకూతుర్ని మృత్యువుకి.విక్రయించడం లాంటిదని ఆయన ఉద్దేశం వెలిబుచ్చారు. వచ్చిన యిద్దరూ తలవంచుకొని వెళ్ళిపోయారు'' అని కథముగిస్తూ శ్రీనివాసరావు, ''రాజారాంగారిప్రవర్తన విచిత్రంగా లేదూ? డబ్బు నెవడైనా పోగొట్టుకుంటాడా! ఏమిటా మనిషి! నాకు ఆశ్చర్యంగా వుందిరా శేషగిరీ!'' అన్నాడు.

శేషగిరి, ''నాకేమీ ఆశ్చర్యంగా లేదు. వేలుకీ, కాలుకీ ఐతే విలువకట్టగలంగాని, ప్రాణానికి విలువేమిటి?'' అన్నాడు.

''అంతేనేమో! కూతురు దారుణ మరణానికి ప్రతిఫలంగా వచ్చేడబ్బును సైతం ఆయన భరించలేకపోయినాడు గాబోలు'' అన్నాడు శ్రీనివాసరావు.

(కథావాహిని 1955)